ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు
జిల్లా వార్తలు

శనివారం 6 జనవరి 2024



తిరుపతి.. చిత్తూరు..మదనపల్లెల్లో
రేపే ముగ్గుల పోటీలు

తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సంక్రాంతిని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను ఈసారి ఆదివారం తిరుపతి, చిత్తూరు, మదనపల్లె పట్టణాల్లో నిర్వహిస్తోంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు..రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన, ఎయిమ్ ఇనిస్టిట్యూట్స్ సౌజన్యంతో మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. తిరుపతి నగరంలో ఇందిరా మైదానం (తుడా మైదానం), చిత్తూరులో ఎన్పీసీ పెవిలియన్ కల్యాణమండపం (నాయుడు బిల్డింగ్స్, విజయ డిగ్రీ కాలేజీ దగ్గర), మదనపల్లెలో జడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున వరుసగా మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపిక కాబడిన ఇద్దరు, మొత్తం 15 మందికి విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. తిరుపతిలో జరిగే పోటీలకు సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్, చిత్తూరులో జరిగే పోటీలకు విజయం విద్యాసంస్థలు, మదనపల్లెలో జరిగే పోటీలకు శ్రీనివాస డిగ్రీ కాలేజ్, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

అంగన్వాడీల పొలికేక
కుప్పంలో ప్రభుత్వ నోటీసు ప్రతుల దహనం



పుంగనూరులో 25 అంకె ఆకృతిలో కూర్చుని నిరసన



కుప్పంలో నోటీసు ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

చిత్తూరు, జనవరి 5: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 25వ రోజుకు చేరింది. జిల్లాలో సీడీపీవో, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ప్రభుత్వ నిర్లక్షవైఖరికి నిరసనగా చిత్తూరులో ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపారు. 25 రోజులుగా నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆ సంఘ నేతలు పేర్కొన్నారు. వీరికి కేవీపీఎస్ నేతలు సంఘీభావం తెలిపారు. కుప్పం సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన దీక్షను చేపట్టారు. సమ్మెను విరమించాలని ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చిన నోటీసు ప్రతులను దహనం చేశారు. పలమనేరులోని సీడీపీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నిరసన కొనసాగించారు. వీరికి సీఐటీయూ నాయకుడు వాడ గంగరాజు సంఘీభావం తెలిపారు. పుంగనూరు సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ నిరసన 25 రోజులకు చేరిన సందర్భంగా 25 అంకె ఆకృతిలో కూర్చొని నిరసన తెలిపారు. కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు పొలికేకలు చేస్తూ తమ నిరసన తెలిపారు. సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండు చేశారు.

ఆరణి మౌనానికి అర్థం?



- టికెట్ విషయంలో అసంతృప్తిలో బలిజ సామాజికవర్గం

చిత్తూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు వైసీపీ టికెట్ విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మౌనం ఇప్పుడు నగరంలో చర్చగా మారింది. ఆయన మౌనానికి అర్థం ఏమిటి.. అసంతృప్తి ప్రకటనా లేక అధిష్ఠానానికి తలొగ్గడమా అనే విశ్లేషణలు సాగుతున్నాయి. ఇటీవల ఆయనతో పాటు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సీఎం జగన్‌ను కలిశారు. అక్కడ చిత్తూరు సీటు విజయానందరెడ్డికి కన్‌ఫర్మ్ అయినట్లు, ఎమ్మెల్యేకు రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ మేరకు విజయానందరెడ్డి చిత్తూరులో కీలక నాయకులతో సమావేశాలను ఏర్పాటు చేసుకుంటున్నారు కూడా. ఆరణి మాత్రం ఎక్కడా చిత్తూరు టికెట్ గురించి ప్రస్తావించడం లేదు. అడిగినా మాట దాటవేస్తున్నారు. దీంతో ఆయన సీఎం ఇచ్చిన రాజ్యసభ హామీని నమ్మి సంతృప్తి చెందారా.. లేదా అసంతృప్తిలో ఉన్నారా అనేది ఇప్పుడు చిత్తూరులో చర్చనీయాంశంగా మారింది. సహజంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ ఇవ్వనప్పుడు రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి ఇస్తామని చెప్పి బుజ్జగించడం పార్టీల్లో సాధారణం. అయితే ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపు ఓటముల మీద ఇదంతా ఆధారపడి ఉంటుంది. గెలిచినా కొన్ని సమీకరణల్లో పదవి ఇవ్వకపోవడమూ జరుగుతుంటుంది. అందుకే ఎన్నికల ముందు ఇచ్చే హామీలకు అంతగా విలువ ఉండదు.

ఇక వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ విజయానందరెడ్డి, ఆరణి శ్రీనివాసులు భిన్నధ్రువాలుగా ఉన్నారు. వారి వర్గాలు కత్తులు దూసుకున్నాయి. వీరిద్దరి మధ్య చిత్తూరులో ఓ స్థాయి అధికారులు నలిగిపోయారు. బలమైన వ్యతిరేక వర్గంతో ఎమ్మెల్యే ఈ ఐదేళ్లు కాస్త ఇబ్బంది పడినమాట వాస్తవమే. సగం క్యాడర్ ఆయన వ్యతిరేక వర్గం వద్దే ఉండేది. వ్యతిరేక వర్గానికి పనులు కూడా బాగా అయ్యేవి. ఇలాంటి కారణాలతో ఎమ్మెల్యే మనస్ఫూర్తిగా మరో అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తారా.. అనే చర్చలు చిత్తూరులో జోరందుకున్నాయి. దశాబ్దాలుగా ఆయన కాంట్రాక్టరు కావడంతో ఈ ప్రభుత్వంలోనూ మంచిగా కాంట్రాక్టు పనులు చేసుకున్నారు. పెద్ద మొత్తంలో బిల్లులు పెండింగులో ఉన్నాయని, ఈ కారణంగా ఆయన పార్టీ మారే సాహసం చేయరని కూడా ప్రచారం జరుగుతోంది.

టికెట్ కోసం బలిజ సంఘం సమావేశం

చిత్తూరు టికెట్‌ను అధికార పార్టీ రెడ్డి సామాజికవర్గానికి కేటాయించిందని ప్రచారమున్న నేపథ్యంలో బలిజ సంఘం నాయకులు అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మిగిలిన టీడీపీ- జనసేన నుంచి అయినా తమ సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ సాధించుకోవాలని బలిజ సంఘం నాయకులు నిర్ణయానికి వచ్చారంటున్నారు.ఈ మేరకు ఇటీవల ఆ సంఘంలోని ప్రముఖ నాయకులు కొందరు చిత్తూరులో సమావేశమైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అందరి చూపూ డీకే కుటుంబంమీద ఉంది.టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఇప్పటికే బలిజ సంఘం నాయకులు బెంగళూరు, చిత్తూరుల్లో పలుమార్లు డీకే కుటుంబంతో భేటీ అయిన విషయం తెలిసిందే. శ్రీనివాస్ కూడా వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటానని ప్రకటించారు. ఇక డీకే ఆదికేశవులు తమ్ముడు బద్రినారాయణ తాము టీడీపీలోనే ఉన్నామని పలుమార్లు చెబుతూనే ఉన్నారు. ఈ కుటుంబానికి అవకాశం ఇస్తే జిల్లాలో మిగిలిన అభ్యర్థులకు కూడా ఆర్థిక సాయం చేస్తారని రాజకీయ వర్గాలు చెప్పుకుంటున్నాయి. అయినా డీకే కుటుంబ నిర్ణయాన్ని బట్టే టీడీపీ- జనసేన కూటమి అభ్యర్థి విషయంలో స్పష్టత వచ్చే అవకాశముంది. సంక్రాంతిలోగా అభ్యర్థిని ప్రకటించాలని టీడీపీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది.

ఎంఎస్ బాబు
యూటర్న్

- మూడు రోజుల్లో మారిన మాట
- పెద్దిరెడ్డి వార్నింగ్ ప్రభావమేనా?



చిత్తూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తనకు టికెట్ నిరాకరించారనే బాధాగ్రహంతో ఘాటు వ్యాఖ్యలు చేసిన పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మూడు రోజులకే మడం తిప్పి, మాట మార్చేశారు. 'అబ్బే.. నేను తప్పుగా మాట్లాడలేదు. అంతా ఎల్లో మీడియా వక్రీకరించేసింది' అంటూ నిందారోపణలకు దిగిన తీరు రాజకీయవర్గాల్లో మళ్లీ చర్చగా మారింది. వైసీపీలో దళితులకు అన్యాయం జరుగుతోందని, దళితుడిగా పుట్టడమే తప్పా అనీ. సీఎంగారూ దళితులను మోసం చేయద్దు అనీ ఆయన అన్న మాటల వీడియోలు సోషల్ మీడియాలోనూ వైరల్ అయ్యాయి. మూడే రోజుల్లో యూటర్న్ తీసుకున్న ఆయన సీఎంనూ, మంత్రి పెద్దిరెడ్డినీ పొగుడుతూ శుక్రవారం విడుదల చేసిన సెల్ఫీ వీడియో తాజాగా వైరల్ అవుతోంది. పాత వీడియోతో కొత్త వీడియోని పోల్చుకుని జనం ఆశ్చర్యపోతున్నారు. ఈ నెల 2న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తన ఆవేదనంతా ప్రకటించారు. ఆ తర్వాత 4న ఎంఎస్ బాబుపై మంత్రి పెద్దిరెడ్డి ఫైర్ అయ్యారు. 'జడ్పీటీసీగా ఓడిపోయిన వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించామనేది గుర్తు చేసుకోవాలి. ఇంగిత జ్ఞానం లేకుండా ఎవరో చెప్పిన మాటలు విని రెచ్చిపోయి మాట్లడటం సబబు కాదు' అని హెచ్చరించారు.

మూడురోజుల్లో మాట ఎలా మారింది...

దీంతో తన మాటలు దిద్దుకుంటూ 5న మళ్లీ ఎంఎస్ బాబు సెల్ఫీ వీడియో విడుదల చేశారు. 'ఈ ఐదేళ్లు మంత్రులు చెప్పిందే చేశాను, మరి వ్యతిరేకత వస్తే అందుకు బాధ్యులు ఎవరు?' అని ప్రశ్నించిన ఆయనే తాజాగా 'పెద్దిరెడ్డి మా దేవుడు. ఆయన మాటకు ఎదిరించి వెళ్లం. ఆయనతోనే ఉంటాం' అన్నారు. ఈ దిద్దుబాటు మాటల వెనుక ఏం జరిగిందనే చర్చ జరుగుతోంది. ఎంఎస్ బాబు పార్టీ మీద తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన తర్వాత సీఎంవో నుంచి పెద్దిరెడ్డికి సూచనలు వచ్చినట్లు తెలిసింది. ఆ మేరకు పెద్దిరెడ్డి ఎంఎస్ బాబుకు గట్టి వార్నింగ్ ఇచ్చినట్లు వైసీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అందుకే ఎంఎస్ బాబు హడావిడిగా కారులో ప్రయాణిస్తూ 5.48 నిమిషాల వీడియో రికార్డు చేసి విడుదల చేశారంటున్నారు. ఆ వీడియోను ఆరుసార్లు పాజ్ నొక్కి రికార్డు చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

- వచ్చిన పెన్షన్ రాలేదని చెప్పి

మనిషి ప్రాణం తీస్తారా?

- వైసీపీ అరాచకాలతోనే సర్దార్ మృతి
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్సీ కంచర్ల డిమాండ్



మృతి చెందిన సర్దార్ సాబ్



సర్దార్ సాబ్ చనిపోయిన వివరాలను ఎమ్మెల్సీకి వెల్లడిస్తున్న కుమారుడు

శాంతిపురం, జనవరి 5: 'వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ భార్య పంపిణీ చేసిన చీర తీసుకోలేని పెన్షన్ ఆపేయడం ఎంతవరకు న్యాయం? వచ్చిన పెన్షన్‌ను రాలేదని అబద్దాలు చెప్పి ఒక మనిషి ప్రాణం తీశారు' అంటూ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మండిపడ్డారు. సర్దార్ సాబ్‌కు అప్పుడే పెన్షన్ ఇచ్చేసి ఉంటే ఆయన చనిపోయేవాడు కాదన్నారు. వైసీపీ అరాచకాలతోనే నిండు ప్రాణం బలైందన్నారు. శాంతిపురం మండలం సోగడబల్ల గ్రామంలో శుక్రవారం ఉదయం టీడీపీ నేతలతో కలిసి ఆయన సర్దార్ సాబ్ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబీకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సర్దార్ సాబ్ కుమారుడు ముజ్జుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'సర్దార్‌సాబ్ మృతిచెందాక సచివాలయ సిబ్బంది, వలంటీరు, వైసీపీ నేతలతో చర్చించారు. పెన్షన్ కోసం గొడవపడి మృతి చెందారనే విషయం బయట పడకుండా ఉండేందుకని ఇంటికి మృతదేహం రాగానే వేలిముద్ర తీసుకుని కుటుంబ సభ్యులకు పెన్షన్ ఇచ్చారు. ఇదే పెన్షన్‌ను అప్పుడే ఇచ్చుంటే ఇలా జరిగేది కాదు కదా? ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయేది కాదు కదా' అని శ్రీకాంత్ అన్నారు. ఎమ్మెల్సీ సతీమణి ఇచ్చిన చీర తీసుకోలేదని చెప్పి పెన్షన్ ఆపేసి.. ఆయన మృతికి కారుకులైన వైసీపీ నేతలు, సచివాలయ సిబ్బంది, వలంటీరుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు. లేదంటే టీడీపీ తరపున న్యాయ పోరాటం చేసి ఆ కుటుంబంను ఆదుకుంటామన్నారు. అనంతరం మృతుడి కుటుంబానికి రూ.పదివేల ఆర్థిక సాయం చేశారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, క్లస్టర్ ఇంచార్జి చంద్రశేఖర్, యూనిట్ ఇంచార్జి గోపాల్, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మంజునాథ్, నేతలు విజయరామిరెడ్డి, నారాయణరెడ్డి, ఏఎంసీ నాగరాజు, ఆర్ఎస్ మణి, రమేష్, మురళి, బాబుసాబ్, సుబ్రహ్మణ్యం, రామకృష్ణారెడ్డి, నన్నాసాబ్, నిషార్, కేశవులు, ఎస్.వెంకటేష్, గంట్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సర్దార్‌సాబ్‌కి గుండెజబ్బు: వైసీపీ

సోగడబల్ల గ్రామానికి చెందిన సర్దార్‌సాబ్ పెన్షన్ కోసం మృతి చెందాడని టీడీపీ నేతలు చెప్పడం అబద్ధమని వైసీపీ నాయకులు విమర్శించారు. మండల వైసీపీ కన్వీనర్ దండపాణి, కన్వీనర్ కోదండరెడ్డి, చెంగుబల్ల సర్పంచి బాస్కర్, రాష్ట్ర డైరెక్టర్ చంగప్ప శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సర్దార్ సాబ్‌కు గతంలోనే గుండె జబ్బు ఉండేదని, ఇప్పటికే రెండు మూడు సార్లు గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు.

అయ్యో.. కొడుకా!

- కుమారుడి మృతి తట్టుకోలేక స్పృహ తప్పిన తల్లి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి





సురేంద్రరెడ్డి, సుశీలమ్మ (ఫైల్‌ఫొటోలు)

చిత్తూరు, జనవరి 5: అచేతనంగా పడున్న కొడుకును చూసి ఆ తల్లి తల్లడిల్లింది. అలా చూస్తూ కుప్పకూలింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ఈ విషాద ఘటన చిత్తూరు నగరంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కట్టమంచికి చెందిన సురేంద్రరెడ్డి(58) స్థానికంగా ఉన్న బుల్లెట్ షోరూమ్‌లో పనిచేస్తున్నారు. ఇతడి భార్యకు అనారోగ్యం కారణంగా ఆమె, తన అత్తతో కలిసి బుధవారం ఉదయం నగరంలోని ఎస్టేట్‌లో ఉన్న తన పుట్టింటికి వెళ్లారు. దీంతో అదే రోజు మధ్యాహ్నం హోటల్‌లో భోజనం తీసుకుని సురేంద్ర ఇంటికి వెళ్లారు. తలుపు గడియపెట్టిన తర్వాత దుస్తులు మార్చుకునే ప్రయత్నంలో గుండె పోటుకు గురయ్యారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అక్కడే మృతిచెందారు. పుట్టింటిలో ఉన్న ఆయన భార్య హరిప్రియ సాయంత్రం ఫోన్ చేయగా తీయలేదు. బిజీగా ఉంటారని ఆమె మిన్నకుండిపోయారు. కాసేపటి తర్వాత ఫోన్ చేసినా తీయకపోవడంతో షోరూమ్ నిర్వాహకులకు ఫోను చేసి చెప్పారు. తాము ఫోను చేసినా ఫోను తీయడం లేదని వారు సమాధానమిచ్చారు.గురువారం ఉదయం భార్య, తల్లి ఇంటికి వచ్చిచూడగా హాలులో సురేంద్రరెడ్డి కుప్పకూలిపోయి.. అచేతనంగా పడున్నారు. అతడిని అలా చూసేసరికి తల్లి సుశీలమ్మ(83) కూడా అక్కడే కుప్పకూలిపోయారు. దాంతో ఆమెను చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా,చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు.ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది. సురేంద్రరెడ్డి చిన్న కుమారుడు యూఎస్ఏలో ఉన్నందున శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పింఛను ఆపేశారనే ఆవేదనతోనే మృతి

చిత్తూరు సిటీ: పింఛను ఆపేశారనే ఆవేదనతోనే శాంతిపురం మండలం సోగడబల్ల గ్రామానికి చెందిన సర్దార్ సాబ్ మృతిచెందారని ముస్లిం మైనార్టీ నేతలు ఆరోపించారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సర్దార్‌సాబ్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గమ్మ సోగడబల్లలో చీరలు పంపిణీ చేయగా సర్దార్ సాబ్ కుటుంబీకులు తిరస్కరించారన్నారు. ఆ కోపంతో వైసీపీ నేతలు పింఛను ఆపేయడంతో ఆయన మృతిచెందారన్నారు. ఇది ముమ్మాటికి వైసీపీ నేతలు చేసిన హత్యేనని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనార్టీ నేతలు నౌషాద్, జాఫర్, అక్తర్, నవాజ్, గౌస్, అన్సర్, జిలాని, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సాబ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముస్లిం మైనార్టీ నేతలు

రూ.3.13 కోట్ల మెగా చెక్కు అందజేత



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 5: అర్హులై ఉండి గతంలో ప్రయోజనం పొందని వారికి ద్వైవార్షిక లబ్ధికింద సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్నారు. ఇలా జిల్లాలోని 2065 మందికి రూ.3.13 కోట్ల చెక్కును శుక్రవారం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షన్మోహన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, డీఆర్డీఏ పీడీ తులసి, సంక్షేమశాఖ అధికారి రాజ్యలక్ష్మి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బాని బాషా, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, డీఈవో విజయేంద్ర రావు, డీఎల్డీవో రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 5: గడచిన 24 గంటల్లో మూడు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. సదుంలో 3.4, శాంతిపురంలో 2.4, సోమలలో 1.0 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.

18 నుంచి కార్మిక బీమాపై స్పెషల్ డ్రైవ్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 5: కార్మికుల శ్రేయస్సు, భద్రత కోసం కార్మిక శాఖ ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు 10రోజుల పాటు జిల్లా అంతటా ఇన్స్యూరెన్స్ కల్పనకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం జేసీ తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. జేసీ మాట్లాడుతూ వలంటీర్ల సహకారంతో కార్మికులందరితో రూ.110 ఇన్స్యూరెన్స్ ప్రీమియం చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇన్స్యూరెన్స్ చేసుకున్న కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, దివ్యాంగుడైతే రూ.25 వేల నుంచి రూ.5 లక్షల వరకు, సాధారణ మరణానికి రూ.60 వేలు, పిల్లల వివాహాలకు రూ.20 వేలు, కాన్పులకు రూ.20 వేలు అందిస్తారన్నారు. కార్మికుల్లో నైపుణ్యత పెంపుకోసం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపకార వేతనం కూడా చెల్లిస్తామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్ రావు, డీఆర్డీఏ పీడీ తులసి, డ్వామా పీడీ గంగాభవాని, పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), జనవరి 5: కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తిరుపతికి చెందిన సతీష్ రూ.1,01,116ను శుక్రవారం విరాళంగా అందించారు. విరాళ దాతను సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పూరి టు హిమాలయాలు

ఆస్ట్రేలియా వనిత నడక ప్రయాణం



వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో జోడి

పుత్తూరు, జనవరి 5: ఆది శంకరాచార్య ఆధ్యాత్మిక ప్రేరణతో పూరి నుంచి దక్షిణ భారతదేశం మీదుగా హిమాలయ పర్వతాల వరకు ఒంటరిగా ఎనిమిది నెలలు నడిచేందుకు ఓ విదేశీ వనిత శ్రీకారం చుట్టింది. ఆస్ట్రేలియా దేశం పెర్త్ నగరానికి చెందిన ఆమె పేరు జోడి. వయస్సు 31 సంవత్సరాలు. డిగ్రీ వరకు చదివి యోగా టీచర్‌గా పని చేస్తోంది. మెడిటేషన్, మ్యూజిక్ అంటే ఇష్టం. భిన్న భాషలు, మతాలు వున్న భారత్‌ను ఆధ్యాత్మికత కలిపి వుంచుతోందని ఆది శంకరాచార్యుల బోధనలతో తెలుసుకుంది. స్వయంగా చూసిన అనుభవంతో పుస్తకం రాయాలని భావించింది. ఎనిమిది నెలల ఒంటరి ప్రయాణానికి ఇంటి నుంచి బయలుదేరి పూరి చేరుకుంది. 53 రోజులుగా నడుస్తూ తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని గురువారం రాత్రి పుత్తూరుకు చేరుకుంది.శుక్రవారం ఉదయాన్నే తిరిగి ప్రయాణాన్ని ప్రారంభించి పుత్తూరు డిగ్రీకళాశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి తన అభిప్రాయాలను పంచుకుంది.రోజూ సరాసరి 30 కిలోమీటర్లు నడుస్తున్నానని చెబుతున్న ఆమె తమ దేశంలో వున్న వాతావరణ పరిస్థితులే ఇక్కడా వున్నాయంటోంది. తన నడకతో మహిళల్లో కూడా ధైర్యం నింపుతానంటోంది. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ రవిరాజు, మాధవనాయుడు, మునికృష్ణయ్య, రామచంద్రనాయుడు, రఘునాధరెడ్డి, రఫీ ఆమెను శాలువాతో సన్మానించి నగరి వైపు కొంత దూరం కూడా వెళ్లి వీడ్కోలు పలికారు.

తిరుపతికి 'స్వచ్ఛ' అవార్డు

తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణ్-2023 జాతీయస్థాయి పురస్కారాల్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు చోటు దక్కింది. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన పారిశుధ్య సర్వేలో దేశంలోనే ఉత్తమ నగరాలుగా గ్రేటర్ విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరపాలక సంస్థలు నిలిచాయి. తిరుపతి నగరం గతంలో బెస్ట్ స్మాల్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ (2021), సఫాయి మిత్ర సురక్షిత్ ప్రెసిడెంట్ అవార్డు (2022) జాతీయ అవార్డులను కైవసం చేసుకుంది. ఈసారి కూడా జాతీయస్థాయి అవార్డు రావడం పట్ల కమిషనర్ హరిత హర్షంవ్యక్తంచేశారు. ఈనెల 11న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నట్లు ఆమె చెప్పారు. తిరుపతి ప్రజల సహకారం, కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది పనితీరు, అధికారుల సమన్వయంతోనే ఇది సాధ్యమైందన్నారు.

లడ్డూ మూడు రోజులకే పాడైపోతోంది

తిరుమల గదుల్లో గీజర్లు పనిచేయడం లేదు

డయల్ యువర్ ఈవోలో భక్తుల ఫిర్యాదులు



తిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో పదిపదిహేను రోజులు నిల్వ ఉండే లడ్డూలు ప్రస్తుతం మూడునాలుగు రోజులకే పాడైపోతున్నాయని బెంగళూరుకు చెందిన మురళి, పిఠాపురానికి చెందిన వెంకట్ శుక్రవారం తిరుమలలో జరిగిన డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం ద్వారా ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. లడ్డూలు నాణ్యత లేదని, చక్కెర అధికంగా ఉండటంతో పాటు సువాసన తగ్గిపోయిందని ఫిర్యాదు చేశారు. ఈవో స్పందిస్తూ లడ్డూల విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఎప్పటి నుంచో ఉన్న శ్రీవైష్ణవ బ్రాహ్మణులే వాటిని తయారు చేస్తున్నారని, నిత్యం వారికి పలు సూచనలు ఇస్తున్నామని అన్నారు. ఇకపై లడ్డూల నాణ్యత విషయంలో మరింత శ్రద్ధ వహిస్తామన్నారు. తిరుమలలో పావురాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ కారణంగా శ్వాస సమస్యలు ఎదురయ్యే అవకాశముందని అనురాధ (నాయుడుపేట) ఈవో దృష్టికి తీసుకురాగా సమస్యపై పరిశీలన చేస్తామని బదులిచ్చారు. కాటేజీల్లో గీజర్లు ఉన్నా పనిచేయడం లేదని జగన్(హైదరాబాద్), మునిలక్ష్మి (నెల్లూరు). గిరన్న (ఆదోని) ఫిర్యాదు చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని ఈవో బదులిచ్చారు. తిరుమల టీదుకాణాల్లో మట్టి గ్లాసులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని పురుషోత్తం(గుంటూరు) సూచించగా యజమానులతో మాట్లాడి అవగాహన కల్పిస్తామన్నారు.

బతికేవున్నాం బాబూ..!

- లైఫ్ సర్టిఫికెట్ల కోసం విశ్రాంత ఉద్యోగుల పాట్లు
- వేలిముద్రలు పడక కార్యాలయాల వద్ద పడిగాపులు



లైఫ్ సర్టిఫికెట్ల కోసం వేలిముద్రలు వేస్తున్న పెన్షనర్లు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 5: విశ్రాంత ఉద్యోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. మారిన లైఫ్ సర్టిఫికెట్ మార్గదర్శకాలతో అవస్థలు పడుతున్నారు. కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఏటా తాము బతికేవున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి. ఆ ప్రకారం జిల్లాలోని 12,505 మంది పెన్షనర్లు ఏటా లైఫ్ సర్టిఫికెట్లు అందిస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించి జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గతంలో సర్టిఫికెట్లతో గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయిస్తే సరిపోయేది. ఇప్పుడు దానిని ఆన్‌లైన్ ప్రక్రియగా మార్చారు. జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా వేలిముద్ర వేస్తే సంబంధిత వివరాలు ఖజానాశాఖకు చేరుతాయి. ఇదో సులభతర మార్గంగా ప్రభుత్వం చెబుతుంది. కానీ వేలిముద్రలు సక్రమంగా పడక పండుటాకులు పడుతున్న అవస్థలు అంతాఇంతా కావు. పెన్షనర్లలో ఎక్కువ మంది 70 సంవత్సరాలు దాటిన వారే. వారి వేలిముద్రలు సక్రమంగా పడడంలేదు. రోజంతా కార్యాలయాల వద్ద ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. వేలిముద్రలు పడనివారు నేరుగా సబ్‌ట్రెజరీ కార్యాలయానికి వెళ్ళి డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అందుకని విశ్రాంత ఉద్యోగులకు సులభంగా ఉన్న పాత విధానాన్నే పునరుద్ధరించాలని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.కేశవులు కోరారు.

నేరుగా లైఫ్ సర్టిఫికెట్ ఇచ్చినా సరి

వేలిముద్రలు పడని వారు నేరుగా లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చినా సరిపోతుంది. వేలిముద్రలు పడడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ముఖ యాప్ ద్వారా సేకరించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చేందులో ఏవైనా ఇబ్బందులుంటే 99516 02382 నెంబరుకు ఫోను చేయండి. ఇంకా కొంతమంది ఈకేవైసీ కూడా చేసుకోలేదు. అటువంటి వాళ్లు త్వరలో చేసుకోకుంటే పెన్షన్ ఆగే పరిస్థితి ఉంది. చిత్తూరుకు రాలేనివారు సమీప ఎస్టీవో కార్యాలయాల్లోనూ చేసుకోవచ్చు. పోస్టాఫీసుల్లోనూ లైఫ్ సర్టిఫికెట్లు చేసుకునే సౌలభ్యం ప్రభుత్వం కల్పించింది. పోస్టుమాస్టర్‌ను కలిస్తే ఇంటికే వచ్చి చేస్తారు.చంద్రశేఖర్, సబ్ ట్రెజరీ ఆఫీసర్, చిత్తూరు.

గంగమ్మ గుడిలో గోల్‌మాల్
వేళ్లన్నీ పాలకమండలి వైపే

- జమాఖర్చులకు వీరి ఆమోదం తప్పనిసరి
- అప్పుడు మౌనంగా ఉండడం వల్లే ఇప్పుడు భారీ మూల్యం
- దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ది కూడా ఇదే దారి
- బాధ్యత ఉండక్కర్లేదా అంటూ భక్తుల మండిపాటు

తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై వేళ్లన్నీ ఆలయ ధర్మకర్తలమండలి వైపే చూపిస్తున్నాయి. అమ్మవారికి భక్తులు సమర్పించే కానుకలు, విరాళాలకు జవాబుదారీతనంగా వ్యవహరించాల్సిన పాలకమండలి చైర్మన్, సభ్యులు ఉత్సవ విగ్రహాల్లా మారారన్న చర్చ జరుగుతోంది.అధికారిక లెక్కల్లోనే రూ.52 లక్షలు మాయమైనప్పటికీ పాలకమండలి మౌనంగా ఉండడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. దేవదాయ శాఖ చట్టం ప్రకారం ధర్మకర్తల మండలికి కీలకమైన అధికారాలుంటాయి. సభ్యుల సమన్వయంతో చైర్మన్ ప్రధాన భూమిక పోషిస్తుంటారు. ప్రతి నెలా జరిగే పాలకమండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలనే కార్యనిర్వహణాధికారి అమలుచేయాల్సి ఉంటుంది. నెలలో దేనికోసం ఎంతెంత ఖర్చుపెట్టారో జమాఖర్చుల వివరాలను తెలియపరిచి సభ్యుల ఆమోదం తీసుకోవాలి. అవసరానికి మించి ఖర్చు పెట్టివుంటే సమీక్షించి చర్యలు తీసుకునే అధికారం కూడా పాలకమండలికి ఉంది. అయితే గంగమ్మ ఆలయ పాలకమండలి మాత్రం ఇవేమీ పట్టనట్టుగా అమ్మవారిని దర్శనం చేసుకోవడం, తెలిసినవారికి దర్శనం చేయించి పసుపు,కుంకుమలను అందజేయడం వరకే పరిమితమైందన్న ఆరోపణలున్నాయి. ఆలయ సిబ్బందికి జీతాలు సక్రమంగా వస్తున్నాయా? లేదా? కూడా వీరికి తెలియదు. అదేవిధంగా ఆలయంలో ఒక కాంట్రాక్ట్ ఉద్యోగికి మాత్రమే భారీగా జీతం పెంచిన విషయం ధర్మకర్తల మండలికి తెలియకపోవడం పలు విమర్శలకు దారితీసింది. అంతెందుకు తుడా కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న ఆలయ ఆర్చి గురించి కూడా వీరి దగ్గర ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది. ఈ పరిణామాలపై ఇప్పటికే పాలకమండలిలో పలువురు అసంతృప్తిగా ఉన్నారు.తమ హయాంలో గంగమ్మ ఆలయంలో గోల్‌మాల్ జరిగిందన్న అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తోందని మధనపడుతున్నారు. చేసిందెవరో, చేయించిందెవరో....అన్నీ గంగమ్మకు తెలుసంటూ వైరాగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు.

● వీరిపైన చర్యలేవీ?

గంగమ్మ ఆలయంలో గత మార్చి ఆర్థిక సంవత్సరానికి జరిపిన ఆడిట్‌లో రూ.17 లక్షలు తేడా కనిపించింది. జాతరకు నెలముందే ఇంత తేడా వచ్చినప్పుడు దేవదాయశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్, సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్, ఆర్జేసీ ఏమీ మాట్లాడకుండా మౌనం దాల్చడం పలు అనుమానాలకు తావిస్తోంది. వీరిలో పలువురిని 'సంతృప్తి' పరచడంతో పాటు అధికార పార్టీ పెద్దల తరపున వత్తిడి తీసుకురావడం, జాతర తర్వాత లెక్కలు చూసుకుంటామని చెప్పడం వలనే చూసీ చూడనట్టుగా ఉన్నారన్న విమర్శలున్నాయి.ముఖ్యంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పూర్తిగా విఫలమయ్యారని చెబుతున్నారు. మరి వీరిపై చర్యలు లేకుండా 'అంతా చేసింది' అతనే అంటూ చనిపోయిన ఇన్‌చార్జి ఈవో మునికృష్ణయ్యపై నెట్టేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.ఇంట్లో పెద్దదిక్కు పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఈవో కుటుంబంపైనే భారం మొత్తం వేస్తామనడం భావ్యం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఆర్జేసీ (ప్రాంతీయ సంయుక్త కమిషనర్) సత్యనారాయణ మూర్తి మీడియానుద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. 'గంగమ్మ గుడిలో గోల్‌మాల్ పై ఈవో బతికివున్నప్పుడు ఎందుకు వార్తలు రాయలేదని, అప్పుడు అవినీతి కనిపించలేదా అంటూ మీడియాను ఆయన ప్రశ్నించారు.జరిగిన తప్పులను పర్యవేక్షించేందుకు పటిష్ఠమైన యంత్రాంగం ఉండి కూడా బాధ్యులపై చర్యలు తీసుకోకుండా, ఆలస్యంగానైనా బయటపెట్టిన మీడియాపై అక్కసు వెల్లగక్కడం ఏమిటనడంతో తాను కొత్తగా వచ్చానని, ఇక్కడ ఏం జరుగుతుందో పూర్తిగా తెలియదని చెప్పుకొచ్చారు.

వచ్చేది మన రామరాజ్యమే

● 95 ఏళ్ల వృద్ధుడి ఉత్సాహం



గంగవరం, జనవరి 5: 'నాయనా అమరా.. వచ్చేది మన రామరాజ్యమే' అంటూ నడవలేని స్థితిలో ఉన్న 95 ఏళ్ల వృద్ధుడు చిడతలతో ఉత్సాహంగా పాట పాడారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలమనేరు మండలం జరావారిపల్లెలో మాజీమంత్రి అమరనాథరెడ్డి పర్యటించారు. వీధిలో ఓ మూలన కూర్చొని కళ్లు కూడా సరిగా కనిపించలేని స్థితిలో ఉన్న 95 ఏళ్ల బంగారప్ప టీడీపీ నేతలను చూసి లేచి నిలబడ్డారు. అమరనాథరెడ్డిని పట్టుకుని వచ్చేది మన రామరాజ్యమే.. చంద్రబాబుతోనే రామరాజ్య స్థాపన అంటూ చేతిలో చిడతలు పట్టుకొని పాడుతూ అందరినీ ఆశ్చర్యానికి గురుచేశారు.

ఇలాగైతే మాకొద్దు!

● ఎండీయూ వాహనాన్ని వెనక్కి పంపిన ప్రజలు



రేషన్‌బియ్యం సక్రమంగా ఇవ్వాలంటున్న గ్రామస్తులు

పుంగనూరు, జనవరి 5: కార్డుదారులందరికీ రేషన్‌బియ్యం ఇచ్చేట్లయితే సరి. లేదంటే మాకొద్దంటూ సదుం మండలం పాలమంద పంచాయతీ చెరువుముందరపల్లె గ్రామస్తులు ఎండీయూ వాహనాన్ని వెనక్కి పంపించారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం సాయంత్రం చెరువుముందరపల్లెకు ఎండీయూ వాహనం వచ్చింది. రేషన్‌కార్డుదారులంతా బియ్యం కోసం వచ్చారు. ఈనెల బియ్యం స్టాక్ తక్కువగా ఉందని, కొంతమందికే పంపిణీ చేస్తామని ఆపరేటర్ చెప్పారు. దీనిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఎవరూ బియ్యం తీసుకోకుండా బండిని వెనక్కిపంపారు. డిసెంబరులోనూ బియ్యం తక్కువ వచ్చిందని చాలా మందికి ఇవ్వలేదని గుర్తుచేశారు. మళ్లీ అదే సాకు చెప్పి తమకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గతనెల కొంతమందికే బియ్యం ఇచ్చారని, కందిబేడలు, చక్కెర తదితర నిత్యావసర వస్తువులు ఏమీ పంపిణీ చేయలేదన్నారు. అధికారులు చర్యలు తీసుకుని బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని వారు కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం : యువతి అరెస్టు

పూతలపట్టు, జనవరి 5: ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తున్న ఓ యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూతలపట్టు మండలం ఎం.బండపల్లికి చెందిన ఓ యువతి ప్రభుత్వ మద్యం షాపులో ఎమ్మార్పీకి కొనుగోలు చేసి, రాత్రిపూట అధిక ధరలకు విక్రయిస్తోంది. స్థానికుల ఫిర్యాదుతో ఎస్ఐ రామ్‌భూపాల్ తమ సిబ్బందితో ఆ యువతి ఇంట్లో తనిఖీలు నిర్వహించి, 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ యువతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రొంపిచెర్లలో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రొంపిచెర్ల, జనవరి 5: రొంపిచెర్ల పంచాయతీలోని ముత్యాలమ్మగుడి వీధిలో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. యల్లమంద కరీముల్లాకు సంబంధించిన ఇంటి పైఅంతస్తులో మంటలు చెలరేగి ఇంటిలోని వస్తువులు, బంగారం, నగదు తదితరాలు కాలి సుమారు రూ1.5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు కరీముల్లా ఆవేదన వ్యక్తం చేశారు. కరీముల్లా మేస్త్రీ పని నిమిత్తం ఉదయం వెళ్లగా అతని పిల్లలు ఇంట్లో ఉండగా ప్రమాదం జరిగింది. మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న నానమ్మను బయటకు తెచ్చి రక్షించారు. చుట్టుపక్కల వారు పీలేరు అగ్నిమాపక సిబ్బందికి తెలపగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి : డీవైఈవో

కల్లూరు, జనవరి5: వినూత్న ఆలోచనలతో సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని తిరుపతి డివిజన్ డీవైఈవో ఆనందరెడ్డి తెలిపారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు నిర్దేశించిన గణిత పాల్ ల్యాబ్స్‌ను సందర్శించిన ఆయన వాటి లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శిద్ధరామయ్య, హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ .25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ : సీఈవో


ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న సీఈవో

కల్లూరు, జనవరి 5: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ: 25 లక్షల వరకు ఉచితంగా చికిత్స అందించనున్నట్లు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవో బాలాజి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ఆయనతో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ప్రభావతీదేవి తనిఖీచేశారు. పేదలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఆరుగురిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఎంఈవో శిద్ధరామయ్య, వైద్యాధికారులు జానకీరావు, షమామరెహ్మాన్, యల్లయ్య, యమున, శీనివాస్, సింధూజ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి


మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీ మధుసూదన్ రెడ్డి

సోమల, జనవరి 5: మామిడి రైతులు పురుగు మందుల పిచికారీలో తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో సోమల, చౌడేపల్లె మండలాల మామిడి రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పూత రావడానికి ఒక లీటరు నీటికి బోరాన్ 2 గ్రాములు, 13. 0. 45 ఎరువును 8 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. పూత నిలువడానికి అర్కా మాంగో స్పెషన్ లీటరు నీటికి 8గ్రాములు పిచికారీ చేయాలన్నారు. మొక్క కాండం నుంచి చిగురు వరకు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అనంతరం శాస్త్రవేత్త రాఘవేంద్ర పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో చౌడేపల్లె ఉద్యానాధికారి సంతోషికుమారి, ఆర్బీకే ఉద్యోగులు నవీన్, రాధిక, నరేశ్, మంజునాథ్, అలియా పలువురు రైతులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



గంగవరం,జనవరి5 : పలమనేరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపి తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో సాంబార్‌పూర్ గ్రామానికి చెందిన మొగిలీశ్వర కుటుంబం, జరావారిపల్లెలో మాధవరెడ్డి, శివారెడ్డి, రోహిత్, గురునాథ్, గోవర్ధన్, వంశీ, పురుషోత్తం, వెంకటేష్‌తోపాటు పలువురు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ మంత్రి అమర్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపి మండల అధ్యక్షుడు నాగరాజురెడ్డి, జగదీష్‌నాయుడు, అమరనాథరెడ్డి, సోమశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

సల్లాపురెమ్మకు పాలాభిషేకం



రామకుప్పం, జనవరి 5: పట్టణం సుభిక్షంగా ఉండాలని కోరుతూ రామకుప్పం పట్టణ శివార్లలోని గ్రామ దేవత సల్లాపురెమ్మకు గ్రామస్తులు 108 కలశాలతో పాలాభిషేకం నిర్వహించారు. పూజారులు హరినాథ్, కృష్ణమూర్తి వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి తొలుత పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

రామకుప్పం, జనవరి 5: వైసీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శుక్రవారం రామకుప్పం పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో నిర్వహించిన పించన్ల పెంపు ఉత్సవ సభలో వారు పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణ, తహసీల్దారు మురళి, వైసీపీ కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డెప్ప, పార్టీ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు విజలాపురంబాబు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ రైతు విభాగం నియోజకవర్గ కన్వీనర్‌గా శ్రీనివాసులు రెడ్డి



రామకుప్పం, జనవరి 5: వైసీపీ రైతు విభాగం కుప్పం నియోజకవర్గ కన్వీనర్‌గా రామకుప్పం మండలం బగళనత్తంకు చెందిన శ్రీనివాసులును నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భరత్ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఫిబ్రవరిలోపు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

పుంగనూరు రూరల్, జనవరి 5: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులందరూ లైఫ్ సర్టిఫికెట్లు ఫిబ్రవరి 29లోపు పుంగనూరు ఎస్టీఓ (సబ్‌ట్రెజరీ కార్యాలయం)లో అందజేయాలని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పి.చెంగారెడ్డి, బి.రామకృష్ణారెడ్డి కోరారు. లైఫ్ సర్టిఫికెట్లు అందజేయడానికి పుంగనూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో సౌకర్యం కల్పించామని, విశ్రాంత ఉద్యోగులు ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ తీసుకురావాలని తెలిపారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి

సదుం, జనవరి 5: మామిడిలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, శాస్త్రవేత్త రాఘవేంద్ర రైతులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మామిడి దిగుబడి-యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. పూత దశలో వాడాల్సిన పురుగుల మందు, పిచికారీ మోతాదు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలు, తదితర అంశాలపై రైతులకు అవగాహనతోపాటు వారి సందేహాలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, హెచ్‌వో సంతోషి కుమారి, ఆర్బీకే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు వి.కోట మండల సమావేశం

వి.కోట, జనవరి 5: వి.కోట మండల సర్వసభ్య సమావేశం ఈనెల 6న నిర్వహించనున్నట్లు ఎంపీపీ యువరాజ్, ఎంపీడీవో మహ్మద్ రఫి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తప్పక హాజరుకావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం




మాట్లాడుతున్న మానవహక్కుల సంఘ నాయకులు డీవి మునిరత్నం, బైరెడ్డిపల్లెలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

గంగవరం, జనవరి 5 : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని మానవహక్కుల, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షుడు డీవి మునిరత్నం హెచ్చరించారు. పలమనేరులో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపడుతున్న సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకొంది. ఈ సమ్మెకు మద్దతు తెలిపిన ఆయన మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించండి అంటూ వేడుకుంటున్నా ప్రభుత్వం కాలయాపన చేస్తూ బెదిరింపు ధోరణులకు పాల్పడుతుండడం అవివేకమన్నారు. అంగన్వాడీల హక్కులకు భంగం కలిగితే మాత్రం ఊరుకుండేది లేదని, ప్రభుత్వ తీరును ఎండగట్టి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంల సంఘ నాయకులు పార్థసారధి, రవికుమార్, ప్రభావతి, వెంకటరత్న, చిలకమ్మతోపాటు సీఐటీయూ, ఏఐటీయూసీ, సమరశీల, ఐఎఫ్‌టీయూ నాయకులు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

పుంగనూరు : బెదిరింపులకు భయపడి సమ్మె విరమించే ప్రసక్తేలేదని అంగన్వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మె 25వ రోజుకు చేరడంతో 25 ఆకారంలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీవర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా పరిగణించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సునీత, రమణమ్మ, విజయకుమారి, మల్లీశ్వరి, కల్పన, అర్చన, సునంద,లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం : కుప్పం అంగన్వాడీలు చేస్తున్న దీక్షలు శుక్రవారంనాడు కూడా కొనసాగాయి. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను నడిరోడ్డుపై దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు లలిత మాట్లాడుతూ ప్రభుత్వం తీవ్రమైన అణచివేత చర్యలకు పాల్పడుతున్నదన్న దానికి ఈ నోటీసులు తాజా నిదర్శమన్నారు. ఇటువంటి బెదిరింపులకు ఎవరూ భయపడేవారు లేరన్నారు. అంగన్వాడీలు అనుకుంటే ఏమి జరుగుతుందో కలెక్టరేట్ల ముట్టడి నిరూపించిందని గుర్తు చేశారు. వెంటనే డిమాండ్లు పరిష్కారం చేయని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షా శిబిరంలో అంగన్వాడీలు బైఠాయించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

బైరెడ్డిపల్లె : తమ అపరిష్కృత సమస్యల పరిష్కారానికై రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం బైరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నిరసన తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు.

శాంతిపురం : రామకుప్పం, శాంతిపురం మండలాల్లోని 190 మంది అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పక్కనే ఉన్న వినాయక స్వామి ఆలయానికి వెళ్లి ఈ గుడ్డి ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని పూజలు చేశారు.


సమ్మె చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

బటన్ నొక్కడం తప్ప.. అభివృద్ధి ఏదీ?

మాజీ మంత్రి అమరనాథరెడ్డి

గంగవరం, జనవరి5 : అప్పులు తెచ్చి బటన్ నొక్కడం తప్ప రాష్ట్రంలో అభివృద్ధి అనే మాటే లేకపోవడం మన దురదృష్టకరమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఆయన పలమనేరు మండలంలోని కరిడిమడుగు, జరావారిపల్లె పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యుల నుంచి కార్మికులు, ఉద్యోగుల వరకు నేడు పోరాటాలు చేస్తున్నారంటే అది కేవలం ప్రభుత్వం వైఫల్యమే అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేరకపోగా, నిరసన కార్యక్రమాలు చేస్తున్న కార్మిక, ఉద్యోగులను బెదిరించడం ఎంతవరకు సమంజసమన్నారు. మన బిడ్డలకు మంచి జరగాలంటే ఇలాంటి ప్రభుత్వాన్ని సాగనంపి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజు రెడ్డి, సోమశేఖర్ గౌడ్, జగదీష్ నాయుడు, గణేష్, మల్లీశ్వర రెడ్డి, అమరనాథరెడ్డి, రామూర్తినాయుడు, పాపిరెడ్డి, గోవిందరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మొగిలప్ప గౌడు, వరదరాజులు, శివకుమారి, జనసేన పసుపులేటిదిలీప్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం : చల్లా

పుంగనూరు రూరల్, జనవరి5: వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధి శూన్యమని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆరోపించారు. శుక్రవారం పుంగనూరు మండలం మేలుందొడ్డి, మార్లపల్లె, గోపిశెట్టిపల్లె, సింగిరిగుంట, అరవపల్లె తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపిశెట్టిపల్లెలో కాల్వలు లేకపోవడంతో వ్యర్థపు నీరు వీధుల్లో నిలిచిపోవడంతో ప్రజలు నడవడానికి ఇబ్బందిగా ఉన్నట్లు తెలిపారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలు పంపడం వారికి అలవాటుగా మారిందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, శ్రీకాంత్, ఆసూరిబాలాజీ, సుబ్రహ్మణ్యంరాజు, విరూపాక్షి, బాలకృష్ణ, మంజునాథ్, శంకర్ రెడ్డి, పవన్, రమణ, చౌడప్ప, నాగరాజరెడ్డి, మసెన్న, గంగాధర్, జనసేన నాయకులు చిన్నారాయల్, పగడాల రమణ, విరూపాక్షి, నరేశ్‌రాయల్, సుబ్బు, పాముల హరి, చైతన్యరాయల్, బాలాజీ నాయక్, హరినాయక్, రమణ తదితరులు పాల్గొన్నారు.


గోపిశెట్టిపల్లెలో మురుగునీటిని దాటుతున్న చల్లా రామచంద్రారెడ్డి

టీడీపీ నేతల అర్ధనగ్న ప్రదర్శన

కల్లూరు, జనవరి 5: ఓటర్ల జాబితా వివరాలను అధికారులు ఇవ్వడంలేదంటూ టీడీపీ నాయకులు సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌దాస్ పులిచెర్ల తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులిచెర్ల మండలంలో ఓటర్లు సమర్పించిన ఫారం 6, 7, 8 సంబంధించిన వివరాలు ఇవ్వాలని డిసెంబర్ 27న తహసీల్దార్‌కు అర్జీ సమర్పించామన్నారు. ఆ వివరాలు నేటికీ ఇవ్వకపోవడంపై శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌ను కోరగా



సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు ఇవ్వాలని తెలిపారన్నారు. డీటీ తెలిపిన మేరకు సమాచారహక్కు చట్టం ద్వారా వివరాలు ఇవ్వాలని దరఖాస్తు సమర్పించామన్నారు. సమాచారంహక్కు చట్టం ద్వారా కోరిన వివరాలను పోస్టల్ ద్వారా పంపుతామని డీటీ తెలిపారన్నారు. నేరుగా ఇవ్వాలని కోరగా వచ్చే బుధవారం ఇస్తామని తెలిపారన్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ వివరణ ఇస్తూ ఫారం మండలంలో 6, 7, 8కు సంబంధించి ఓటర్లనుంచి వచ్చిన వివరాలను సమాచారహక్కు చట్టం మేరకు తప్పులు లేకుండా సోమవారం అందజేస్తామని డీటీ తెలిపారు.

కుష్ఠు నివారణపై అవగాహన



బైరెడ్డిపల్లె, జనవరి 5 : మండలంలోని కడపనత్తంలో శుక్రవారం కుష్ఠువ్యాధిపై బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్య విద్యాధికారి సావిత్రి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. శరీరంపై నొప్పి, స్పర్శలేని రాగిరంగు కలిగిన మచ్చలు వుంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిం చారు. అలాగే సీజనల్‌వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత, చేతులశుభ్రత గురించి వివరించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రామకుప్పం, జనవరి 5: ఆవులకుప్పానికి చెందిన రవి గురువారం రాత్రి మృతి చెందారు. ఎమ్మెల్సీ భరత్, వైసీపీ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు విజలాపురంబాబు, చంద్రారెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి తదితరులు శుక్రవారం రవి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి వారు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

విద్యాసామగ్రి వితరణ



గంగవరం, జనవరి 5: పలమనేరుకు చెందిన శ్రీపురం సీతారావుమ్మయ్య జగమర్ల పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందించారు. 60 మంది విద్యార్థులకు పెన్నులు, నోటుపుస్తకాలు, పలకలు, అట్టలు పంపిణీ చేశారు. అదే గ్రామంలో నిరుపేదలైన 45 మందికి చాపలు, దుప్పట్లను, 15 మంది వృద్ధులకు ఊత కర్రలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శనాచారి, గురుమూర్తి, సలీంబాషా, సుబ్రమణ్యం, జిలానీబాబు పాల్గొన్నారు.

రేపు వన్నెకుల క్షత్రియ సమావేశం

శాంతిపురం, జనవరి5 : కడపల్లె సమీపంలో ఆదివారం వన్నెకుల క్షత్రియ కుల సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల వైసీపీ కన్వీనర్ దండపాణి తెలిపారు. నాలుగు మండలాల్లో ఉన్న వన్నెకుల క్షత్రియ కుటుంబ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, జనవరి 5: రామకుప్పం మండలం ఆవులకుప్పానికి చెందిన రవి గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. తెలుగుయువత మండల ప్రధానకార్యదర్శి వెంకటాచలం, నేతలు సుబ్రహ్మణ్యంనాయుడు, నాగరాజు, గంగాధర్, బాలాజీలు శుక్రవారం రాత్రి రవి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి పార్టీ తరఫున రూ.10వేలు అందజేశారు.

పరమహంస యోగానంద జయంతి



శాంతిపురం, జనవరి 5 : పరమహంస యోగానంద విద్యాలయంలో శుక్రవారం యోగానంద 130వ జయంతి జరుపుకొన్నారు. విద్యార్థులు భజన చేస్తూ పరమహంస యోగానందను స్మరించుకున్నారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణన్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ వివరించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. శెట్టిపల్లె వద్ద ఉన్న విక్టరి బోర్డింగ్ స్కూల్ విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చక్రపాణిరెడ్డి, నారాయణశెట్టి, గణపతి శాస్త్రి, మణి, వెంకటకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, జనవరి5:ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి రాహుకాలంలో ప్రత్యేకంగా పంచామృతాభిషేకాలు, గంధాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, జనవరి5:మండలంలోని పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఓం శక్తి మాలధారణలో ఉన్న మహిళలు వైష్ణవి దేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహకులు భక్తులకు అన్నదానం చేశారు.

నేడు మామిడి రైతులకు అవగాహన

రొంపిచెర్ల, జనవరి 5: మండలంలోని మామిడి రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రొంపిచెర్ల రైతు భరోసా కేంద్రం వద్ద మామిడిలో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఉద్యాన అధికారి సంతోషికుమారి తెలిపారు. ఈసదస్సుకు జిల్లా ఉద్యాన అధికారి మధుసూదనరెడ్డి, ఉద్యానశాస్త్రవేత శ్రీనివాసులురెడ్డి పాల్గొంటారని తెలిపారు.

అయోధ్య అక్షితల పంపిణీ

రొంపిచెర్ల, జనవరి 5: రొంపిచెర్ల, చెంచెమరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో శుక్రవారం శ్రీరామసేన సభ్యులు అయోధ్య శ్రీరాముల వారి అక్షితలు, కరపత్రాలు, చిత్రపటాలను పంపిణీ చేశారు. బుషిరెడ్డిగారిపల్లెలో మాజీ సర్పంచ్ పురం మల్లయ్య కరపత్రాలు ఇచ్చి అక్షతలు పంపిణీ చేశారు. రొంపిచెర్ల, బుషిరెడ్డిగారిపల్లె శ్రీరామాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి అక్షతలు పంచారు.

కల్యాణమస్తు చెక్కుల పంపిణీ



కల్లూరు, జనవరి 5: వైఎస్సార్ కల్యాణమస్తు పథకం ద్వారా ఇద్దరికి చెక్కులు పంపిణీ చేసినట్లు వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, విండో మాజీ అధ్యక్షుడు రెడ్డీశ్వర్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లి పంచాయతీ తువ్వచేను ఎస్సీ కాలనీకి చెందిన భార్గవికి రూ.లక్ష, చెరువుముందరపల్లికి చెందిన అశ్వినికి రూ.50వేలు చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అమరావతి, నాయకులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేకాలంకరణలో మారెమ్మ



పుంగనూరు రూరల్, జనవరి5:పుంగనూరులో వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్య అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గర్భిణులకు ఆహార కిట్ల పంపిణీ

పుంగనూరు రూరల్, జనవరి5: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంగళం గ్రామంలో గర్భిణులు, బాలింతలకు ఆహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యబృందం పర్యటించి రోగాలతో బాధపడుతున్న వారికి చికిత్సలు అందించి అవసరమైన వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఎంపీడీవో సీహెచ్.నారాయణ, సీడీపీవో రాజేశ్వరి, డాక్టర్ సల్మా పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



వి.కోట, జనవరి 5: వి.కోట పంచాయతీ పరిధి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. శుక్రవారం గాండ్లపల్లె, ముదిమడుగు గ్రామాల్లో మురుగుకాల్వలో చెత్తాచెదారాన్ని కార్మికులు తొలగించారు.మరమ్మతుకు గురైన వీధి దీపాలను సరిచేశారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టి, అవసరమైన చోట్ల కొత్తగా కొళాయిలు అమర్చారు. ఊరిబయట చెత్తదిబ్బలను తొలగించారు.

షర్మిలను కలిసిన కుప్పంవాసి



కుప్పం, జనవరి 5: చదువుకున్న యువత కాంగ్రెస్ పార్టీలో చేరి క్రియాశీలకం కావాలని ఆ పార్టీలో నూతనంగా చేరిన షర్మిల తనకు చెప్పినట్లు కుప్పంవాసి డాక్టర్ వరదరాజులు తెలిపారు. అయన ఢిల్లీలో శుక్రవారం షర్మిలను కలిసి, శాలువ కప్పి సత్కరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షుడు రుద్రరాజులను కలిసి సత్కరించారు.

కాంగ్రెస్‌లో షర్మిల చేరికపై హర్షం

బైరెడ్డిపల్లె : కాంగ్రెస్‌పార్టీలో షర్మిల చేరికపట్ల జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడు, డీసీసీ కార్యదర్శి రమణప్ప, మహిళాకాంగ్రెస్ కార్యనిర్వాహక కార్యదర్శి నీలమ్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధనంజయగౌడు హర్షం వ్యక్తం చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి
- మాజీ ఎమ్మెల్సీ దొరబాబు


మాట్లాడుతున్న దొరబాబు

చిత్తూరు సిటీ, జనవరి 5: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. శుక్రవారం స్థానిక 45వ డివిజన్ సంతపేట ఇందిరానగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దొరబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికలముందు పాదయాత్ర సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇంటింటికీ గ్యారెంటీ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కటారి హేమలత, రాష్ట్ర తెలుగుమహిళ కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం విజయ, నేతలు చిట్టిబాబు, జయశంకర్, వరలక్ష్మి, గౌరి, రాధ, సుధాకర్, రాజశేఖర్, కిషోర్, కంద, మురుగ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

వెదురుకుప్పం, జనవరి 5: జరగబోవు ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి కోనేరు చెంగ్రాయరెడ్డి తెలిపారు. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను ఇచ్చి, టీడీపీ మ్యానిఫెస్టోను వివరించారు. బూత్ కమిటీ కన్వీనర్ జయరాంరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, డేటా ఆపరేటరు కావలి మోహన్ మురళి కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధలు తీరాలంటే టీడీపీకి పట్టం కట్టండి


బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న మురళీమోహన్ తదితరులు

బంగారుపాళ్యం, జనవరి 5: బాధలు తీరాలంటే మీ ఓటు అనే ఆయుధంతో టీడీపీకి పట్టం కట్టాలని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. మండలంలోని బొమ్మాయిపల్లి, వజ్రాలపురం, జంబువారిపల్లె, దండువారిపల్లె, మాధవనగర్ గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. ఎన్‌పీ ధరణీ నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, కమల్‌నాథ్ రెడ్డి, హేమచంద్ర నాయుడు, వంశీ, జనార్దన్, రమేష్, హరిప్రసాద్, గిరిబాబు, రాధిక, దేవయాని, అమర, నీరజాక్షులు గౌడ్, సుదర్శన్ నాయుడు పాల్గొన్నారు.

కార్మిక చైతన్య బస్సుయాత్రకు తరలిరండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గాలి భానుప్రకాష్ తదితరులు

నగరి, జనవరి 5: టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర జనవరి 6న టెక్కలి నుంచి కుప్పం వరకు జరిగే కార్యక్రమానికి తరలిరావాలని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. నగరిలో శుక్రవారం కార్మిక చైతన్య బస్సుయాత్ర వాల్‌పోస్టర్లను భానుప్రకాష్, నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి 53 లక్షల మంది కార్మికులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం వారిని రాజకీయంగా బెదిరించడం విచారకరమన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు మాధవ నాయుడు, రాష్ట్ర అధికారప్రతినిధి సుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, నగరి నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు మోహన్‌బాబు, జీవరత్నం నాయుడు, ధనపాల్, హమీద్‌బాషా, వరదరాజులు యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

యువతతో కలిసి కమిషనర్ పారిశుధ్య పనులు


వీధులను శుభ్రం చేస్తున్న కమిషనర్

చిత్తూరు, జనవరి 5: పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో నగర కమిషనర్ అరుణ చీపురు పట్టి వీధులను శుభ్రం చేశారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, స్థానిక కార్పొరేటర్ శశికుమార్, స్థానిక యువతతో కలిసి శుక్రవారం వన్నియర్ బ్లాక్‌వీధులను శుభ్రం చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో బజారువీధి, డీఐ రోడ్డు, వన్నియర్ బ్లాక్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. తమ వార్డులో యువత ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపడతామని కార్పొరేటర్ శశికుమార్ అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

గణితం మేధాశక్తిని పెంచుతుంది


సన్మానించబడిన బాలగణిత అవధానులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 5: గణితం మేధాశక్తిని పెంచుతుందని స్పందన ఫౌండర్ శ్యామలదేవి, అవధాన గురువు అరుణశివకుమార్ పేర్కొన్నారు. గత నెల 22న జిల్లా వ్యాప్తంగా 13 పాఠశాలల్లో నిర్వహించిన బాలగణిత అవధానంలో పాల్గొన్న విద్యార్థులను శుక్రవారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో జేవీకే, ఏపీ మ్యాథ్స్ ఫోరం సంయుక్తంగా సన్మానించారు. అంతకు ముందు 30 మంది విద్యార్థులతో ఒకేసారి అవధాన కార్యక్రమం నిర్వహించారు. విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ గణితం ప్రాధాన్యత నేటి ఆర్థిక వ్యవస్థకు పునాదిగా అభివర్ణించారు. పాపుదేశీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి, జేవీవీ నాయకులు సుధాకర్, చంద్రమ నాయుడు, త్యాగరాజు, రంగనాథం, విజయ్‌కుమార్, బాలయ్య, సుధాకర్, సురేంద్ర పాల్గొన్నారు.

పాఠశాలలకు ఫర్నీచర్ పంపిణీ

పాలసముద్రం, జనవరి 5: మండలంలోని పాలసముద్రం, వెంగళరాజుకుప్పం, ఆముదాల, ఎస్ఆర్ కండ్రిగ, తిరుమలరాజుపురం ఉన్నత పాఠశాలలకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన శ్రీ పద్మావతి వెంకటేశ్వర రూరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం 120 డెస్కులు, 65 టేబుళ్లు, 60కుర్చీలు, 10 ర్యాకులను ఉచితంగా పంపిణీ చేశారు. వీటి విలువ సుమారు రూ.9.50 లక్షలు ఉంటుందని ఉపాధ్యాయులు చెప్పారు. హెచ్ఎం మనోహర్ నాయుడు, చక్రధర్ రావు, కోదండయ్య, ధనరాజ్, స్వామిరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి


సుబ్రహ్మణ్యం నాయుడు (ఫైల్‌ఫొటో)

గుడిపాల, జనవరి 5: టీడీపీ వీరాభిమాని సుబ్రహ్మణ్యం నాయుడు శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన మృతి పార్టీకి తీరని లోటని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

అయోధ్య రామమందిర అక్షతల పంపిణీ

పూతలపట్టు, జనవరి 5: అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షతలను గోపాలక్రిష్ణాపురం గ్రామస్థులు, గ్రామపెద్దలు ఇంటింటికీ పంపిణీ చేశారు. రామమందిరం నుంచి రెండ్రోజుల క్రితం అక్షతలు పూతలపట్టులోని వరదరాజులస్వామి ఆలయానికి రాగా, గోపాలక్రిష్ణాపురం గ్రామస్థులు తమ గ్రామానికి తీసుకెళ్లి పూజలు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

తవణంపల్లె, జనవరి 5: కార్డుదారులకు రేషన్ సరుకులను ఎండీయూ ఆపరేటర్లు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మాధవరం, బోయపల్లె, గాజులపల్లె, జొన్నగురకల గ్రామాల్లో జరుగుతున్న నిత్యావసర సరుకుల పంపిణీని తహసీల్దార్ తనిఖీ చేశారు. డీటీ నరేష్, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అపస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న డీఈవో తదితరులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 5: ఆపస్ 2024 సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డీఈవో విజయేంద్రరావు ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన శవన్నగారి బాలాజీ జిల్లా సంఘం నాయకులతో శుక్రవారం డీఈవోను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దొరస్వామి, డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ చిట్టిబాబు, సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజునాథగుప్తా, విజయ్, సుబ్రమణ్యం, కోశాధికారి హనుమంతరెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, జనవరి 5: శుక్రవారం చిత్తూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నూతన, పెరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 61 కొత్త పింఛన్లను, పెరిగిన పింఛన్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. చిత్తూరు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెనుమూరులో...

పెనుమూరు: శుక్రవారం పెనుమూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పింఛన్ల పంపిణీకి డిప్యూటీ సీఎం నారాయణస్వామి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, తహసీల్దారు కళావతి, స్పెషల్ ఆఫీసర్ సుబ్రమణ్యం, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో...

వెదురుకుప్పం: వెదురుకుప్పంలో పింఛన్‌ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అంతకు ముందు వెదురుకుప్పం మండలం మాంబేడులో నూతనంగా నిర్మించిన వెల్నెస్ సెంటర్‌ను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్, గృహ సారథుల మండల కన్వీనర్ బట్టే సుబ్రహ్మణ్యం, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, వైసీపీ మండలాధ్యక్షులు కామసాని పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో...

బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద శుక్రవారం వైఎస్సార్ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.బి. కుమార్‌రాజా, వైసీపీ నాయకులు రామచంద్రారెడ్డి, సోమశేఖర్, సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, ఎంపీటీసీ ఉషారాణి, మైనార్టీ నాయకుడు సర్దార్, ఉపసర్పంచ్ కామరాజు, కిషోర్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కార్వేటినగరంలో...

కార్వేటినగరం: మండలంలోని కార్వేటినగరం, గోపిశెట్టిపల్లి, ఎల్ఆర్ పేట గ్రామ పంచాయతీలకు కలిపి ఎనిమిది నూతన పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో మోహన్‌మురళి తెలిపారు. ఎంపీపీ లత ఈ పింఛన్లను పంపిణీ చేశారు.

306 మందికి వైద్య పరీక్షలు

పెనుమూరు, జనవరి 5: మండలంలోని శాతంబాకం సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 306 మందికి డాక్టర్లు వైద్యసేవలు అందించారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అందించే పౌష్టికాహారాలను డిస్‌ప్లే చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యశోదారెడ్డి, సర్పంచ్ జయచంద్రారెడ్డి, నవీన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, డాక్టర్లు రాజశేఖర్, అనిల్‌కుమార్, హర్షవర్ధన్, మీనాసయ్యద్, డీడీవో శ్రీనివాసులు, కీర్తిప్రియ, రూప, చరిత తదితరులు పాల్గొన్నారు.

గొడుగుచింతలో...

పూతలపట్టు: మండలంలోని గొడుగుచింత గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆరోగ్యశ్రీ సీఈవో బాలాజి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ పోలవరం సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, వైద్యాధికారులతో పాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి థామస్ నివాళి

కార్వేటినగరం, జనవరి 5: కార్వేటినగరం పంచాయతీ పెద్ద దళితవాడకు చెందిన టీడీపీ కార్యకర్త గంగాధరం మృతికి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ శుక్రవారం ఘన నివాళి అర్పించారు. టీడీపీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెంగల్ రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, నాయకులు రవియాదవ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలను కాపాడుకోవాలి: డీవైఈవో

చిత్తూరు (సెంట్రల్), జనవరి 5: ఆడబిడ్డలను కాపాడుకోవాలని విద్య, వైద్య శాఖ అధికారులు పిలుపునిచ్చారు. స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సేవ్ గర్ల్‌చైల్డ్ అనే అంశంపై విద్య, వైద్య శాఖలు సంయుక్తంగా వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. డీవైఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ అంశంపై చిన్న వయస్సు నుంచే విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఆయా విభాగాల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఎంఈవోలు రమేష్‌బాబు, గణపతి, మోహన్, త్యాగరాజరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటలకు మట్టిపోసిన పోలీసు శాఖ



గుడిపాల, జనవరి 5: ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అనే కథనానికి శుక్రవారం గుడిపాల పోలీసులు స్పందించారు. వెస్ట్ సీఐ రవిశంకర్ ఆధ్వర్యంలో పానాటూరు వద్ద గుంటలమయంగా ఉన్న రోడ్లకు మట్టి పోసి చదును చేశారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు హర్షం వెలిబుచ్చారు. మిగిలిన గుంటలను కూడా రెండ్రోజుల్లో పూడ్చేస్తామని సీఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యువతకు క్రికెట్ కిట్ వితరణ



విజయపురం, జనవరి 5: మండలంలోని విజయపురం దళితవాడలో శుక్రవారం టీడీపీ యువనేత కపిల్ క్రికెట్ కిట్‌ను వితరణగా పంపిణీ చేశారు. యువతకు క్రికెట్‌లో నైపుణ్యం పెంపొందించడానికి వితరణగా అందించినట్టు తెలిపారు. ప్రతి యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ యువత పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త...!

- కంపుకొడుతున్న మిట్టూరు


రంగారెడ్డి వీధిలో పేరుకుపోయిన చెత్త

చిత్తూరు రూరల్, జనవరి 5: చిత్తూరు నడిబొడ్డున ఉన్న మిట్టూరు కంపుకొడుతోంది. మిట్టూరులోని రంగారెడ్డి వీధి, బక్కరబాయి వీధి తదితర వీధుల్లో గత వారం రోజులుగా చెత్త తొలగించకపోవడంతో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా రంగారెడ్డి వీధిలో చెత్త తొలగించే కార్మికులు వచ్చి నాలుగు రోజులు అవుతోంది. ఈ కారణంగా ఇళ్లల్లో, వీధుల్లో, కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. వీధుల్లో దోమలు కూడా అధికమై రోగాలు వస్తాయని స్థానికులు భయందోళనకు గురవుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ఇళ్లల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుండటంతో వీధుల్లో పారబోస్తున్నారు. దీంతో వీధులు కంపు వాతావరణం నెలకొంది. అంటు వ్యాధులు ప్రబలక ముందే కమిషనర్ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు పలువురి సంఘీభావం


చిత్తూరులో ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ విభాగం ఉద్యోగుల నిరసన

చిత్తూరు, జనవరి 5: నగరపాలకసంస్థ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెకు టీడీపీ సీనియర్‌నేత, జీజేఎం నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు సంఘీభావం తెలిపారు. శుక్రవారం నగర పాలకసంస్థ వద్ద అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరసనలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం వారికి అన్నదానం చేశారు. ఇంజనీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన శిబిరంలో నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని చెప్పారు. కార్యక్రమంలో ది ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామ్మూర్తి, నేతలు వెంకటేష్, జయప్రకాష్, శివకుమార్, శివప్రసాద్, లక్ష్మి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగరి: సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె ఆపేది లేదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య పేర్కొన్నారు. శుక్రవారం నగరి పట్టణ పరిధిలోని టవర్‌క్లాక్ వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు మున్సిపల్ కార్మికులు ర్యాలీగా వచ్చి ధర్నా చేపట్టారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. కోదండయ్య మాట్లాడుతూ సమాజంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా చూసే కార్మికులకు జీతాలు పెంచకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వేలన్, బాషా, మునస్వామి, మురళి, శేఖర్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి చేయూత


మామిడి తోటను పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

పెనుమూరు, జనవరి 5: రైతుల పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం చేయూతనిస్తుందని, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పేద రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తుందని సీఆర్డీ జాయింట్ కమిషనర్ అశోక్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన పెనుమూరు మండలంలోని సామిరెడ్డిపల్లి, శాతంభాకం పంచాయతీల్లో పర్యటించారు. మామిడి తోటల పెంపకాన్ని, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఎక్కువగా కొబ్బరిచెట్లు, జామ, సపోట, నిమ్మ తదితర పంటల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ గంగాభవాని, ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీవో మీనాకుమారి, సిబ్బంది మదివన్నన్, వినోద్‌కుమార్, బాబు, సతీష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖ సినీ నటుడు


స్వామి సేవలో పాల్గొన్న గరుడ రామచంద్రరాజు

ఐరాల(కాణిపాకం), జనవరి 5: సినీ నటుడు గరుడ రామచంద్రరాజు కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి


చిత్తూరులో మాట్లాడుతున్న సురేంద్రన్


నింద్రలో అంగన్‌వాడీలకు భోజనం ఏర్పాటు చేస్తున్న టీడీపీ నాయకులు

చిత్తూరు రూరల్, జనవరి 5: సీఎం జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ నేత సురేంద్రన్ అన్నారు. శుక్రవారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేశారు. ఆయన మాట్లాడుతూ గత 25 రోజులుగా అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుజని, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నింద్రలో అంగన్‌వాడీలు నిరవధికసమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. వీరికి టీడీపీ మండల మాజీ తెలుగు యువత కార్యదర్శి రమేష్ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కార్వేటినగరం: పాలికేకలతో మీ సమస్యలను వినిపించండి అంటూ కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద గత 25 రోజులుగా సమ్మెచేస్తున్న అంగన్వాడీలకు శుక్రవారం సీఐటీయూ నేత గంగరాజు పిలుపునిచ్చారు. అంగన్వాడీల న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చామని, అయినా ఎలాంటి స్పందన లేదని వాపోయారు. భవిష్యత్తులో ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మహిళా నాయకురాలు మమత, రాధమ్మ, అంగన్వాడీలు సమ్మెలో పాల్గొన్నారు.

మామా.. వీట్లే రెస్ట్ వాంగికో

- డిప్యూటీ సీఎం నారాయణస్వామికి తమిళంలో ఘాటుగా సమాధానమిచ్చిన టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్


వైసీపీకి చెందిన యువకులకు టీడీపీ కండువాలు కప్పుతున్న డాక్టర్ థామస్

గంగాధరనెల్లూరు, జనవరి 5: నారాయణస్వామి మామా.. ఉంగలుకు వయసాచ్చి వీట్లే రెస్ట్ వాంగికో ఇన్నిమేలా అరిసిల్‌పడితి ఉనికికవలవేండా.. వయసాచ్చి అదినాల ఎన్నా పేసరింగో ఉంగలుకు తెరియలే ఉనికి నాన్ మచ్చనే అదినాల ఎల్లమే నాపాతికరే (నారాయణస్వామి మామా.. మీకు వయసు అయిపోయింది.. ఇంట్లో విశ్రాంతి తీసుకోండి.. ఇకమీదట రాజకీయాల గురించి మీరు ఆందోళన పడాల్సిన పనిలేదు.. వయసు పెరిగిపోవటం వల్ల మీరు ఏం మాట్లాడుతున్నారో మీకే తెలియటంలేదు.. ఇకపై మీకు బామ్మర్ది అయిన నేను ఆ విషయాలున్నింటిని చూసుకుంటా) అంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామికి వ్యంగంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ తమిళంలో ఘాటుగా సమాధానం ఇచ్చారు. గంగాధరనెల్లూరు మండలం వీరకనెల్లూరు పంచాయతీలో మన ఇంటికి మన డాక్టర్ థామస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'మీకు కేటాయించిన మంత్రిశాఖలు లిక్కర్, సేల్ ట్యాక్స్ శాఖలను అడ్డంపెట్టుకుని కమీషన్ డబ్బులు దండుకొని దాచుకోలేదని.. 24గంటల పాటు డాక్టర్‌గా కష్టపడి సంపాదించిన డబ్బునే పేద కుటుంబాలకు నావంతు సహాయం చేశాను' అన్నారు. దళితవాడల్లో అనారోగ్యంతోనో, ప్రమాదంలోనో మరణిస్తే, ఆ కుటుంబాలను పరామర్శించి తను ఆర్థికసహాయం చేయడాన్ని సహించలేక, ఇన్‌కంటాక్స్ ఈడీ అంటూ బెదించే ధోరణికి పాల్పడుతున్నారని అన్నారు. ఈసందర్భంగా వైసీపీకి చెందిన వీరకనెల్లూరు వైస్ సర్పంచ్ నరేష్‌తో పాటు పదిమంది యువకులు ఇన్‌చార్జి థామస్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా టీడీపీ యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కోదండరెడ్డి పాల్గొన్నారు.

వికలాంగులకు సత్వర న్యాయం అందించాలి


కమిషనర్‌కి సమస్యలు వివరిస్తున్న ఏపీ దివ్యాంగ కమిటీ నేతలు

నింద్ర, జనవరి 5: విజయవాడలోని విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ రవిప్రకాష్‌రెడ్డితో ఏపీ దివ్యాంగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర కమిటీ సమావేశమయ్యారు. వారు కమిషనర్‌తో మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టం-2016, 92(ఏ)సెక్షన్‌పై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అధికారులకు అవగాహన లేమితో దివ్యాంగులు అన్యాయానికి గురవుతున్నారని, తక్షణమే పోలీసు ఉన్నతాధికారులకు అవగాహన కల్పించి వికలాంగులకు సత్వర న్యాయం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. పలు సమస్యలను పరిష్కరించాల్సిందిగా కమిషనర్ రవిప్రకాష్‌రెడ్డికి చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు రామరాజు, కార్యవర్గ సభ్యులు అశోక్‌వర్ధన్ తదితరులు వినతిపత్రం అందజేశారు. కమిషనర్ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

మండల టీడీపీ సమన్వయకర్తగా శివప్రసాద్ నియామకం

గంగాధరనెల్లూరు, జనవరి 5: మండల టీడీపీ సమన్వయకర్తగా గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన జె.వి.శివప్రసాద్‌ను నియమించినట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం శివప్రసాద్‌కు నియామకపు పత్రాన్ని ఆయన అందజేశారు. తనపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టినందుకు థామస్‌తో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, మండల, నియోజకవర్గ, పార్లమెంట్ నేతలకు శివప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

మేల్‌మరువత్తూర్ యాత్రకు ఉచిత బస్సు


చీరలు పంపిణీ చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు సిటీ, జనవరి 5: ఓం శక్తి భక్తులు మేల్‌మరువత్తూర్‌కు వెళ్లిరావడానికి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత బస్సులను ఏర్పాటుచేశారు. శుక్రవారం రాత్రి నగరంలోని 11వ డివిజన్ జోగుల కాలనీ, చిత్తూరు రూరల్ మండలం నాయని చెరువు, గుడిపాల మండలం ఏఎల్ పురంలో ఓం శక్తి భక్తులు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు. ఆయన ఓం శక్తి భక్తులకు అన్నదానం, ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. నగరంలోని 13వ డివిజన్ ఉయ్యాల చింతలో మేల్‌మరువత్తూర్ యాత్రకు ఉచిత బస్సును ప్రారంభించారు. ఫౌండేషన్ ఛైర్మన్ గురజాల జగన్మోహన్‌కు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో నూతన ఉత్తేజం పొందాలి

చిత్తూరు కల్చరల్, జనవరి 5: భావిభారత పౌరులు, నేటి యువత నూతన శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంతో పయనించాలని తపోవనం ఆశ్రమ కో ఆర్డినేటర్ వి. రాఘవులు నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక తపోవనం ఉన్నత పాఠశాలలో పలమనేరు మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన ఆవిష్కరణలతో వ్యవస్థాపకతను చేరువచేయుట అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, యువత తమ ఆలోచనలను ఆచరణలో పెట్టి సాంకేతిక విజ్ఞానాన్ని సమాజంలో విస్తరించాలని కళాశాల కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీమోహన్ అన్నారు. పాఠశాల హెచ్ఎం గజలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన తీర్థం పుచ్చుకున్న రాజకుమార్


జనసేన పార్టీ కండువా కప్పుతున్న హరిప్రసాద్

ఐరాల(కాణిపాకం), జనవరి 5: జనసేన పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానని కాణిపాకానికి చెందిన రాజకుమార్ అన్నారు. వైసీపీకి చెందిన ఆయన శుక్రవారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడినై పార్టీలో చేరానన్నారు. మండలంలోని గ్రామగ్రామాల్లో పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. గ్రామాల్లో ఇప్పటికే ప్రజలు జనసేన వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, కార్యదర్శి భానుప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

పరీక్షలంటే భయపడాల్సిన పనిలేదు

గంగాధరనెల్లూరు, జనవరి 5: పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థినీ విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని, ఉత్తమ మార్కులతో రాణించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని బాలుర, బాలికల హాస్టళ్లలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం గంగాధరనెల్లూరు హైస్కూల్లో ప్రేరణ తరగతుల సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్, పెన్నులతో పాటు విద్యాసామగ్రిని డీడీ పంపిణీచేశారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారిణి షకీలా, ఎంఈవో ఆంజనేయులుశెట్టి, హెచ్.ఎం.హేమలత, హాస్టల్ సంక్షేమాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

థామస్‌ను విమర్శించడం తగదు: భీమనేని

పాలసముద్రం, జనవరి 5: గంగాధరనెల్లూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్‌ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి విమర్శించడం తగదని తెలుగుదేశం పార్టీ ప్రభావశీలుల గుర్తింపు రాష్ట్ర కమిటీ సభ్యులు భీమనేని చిట్టిబాబు నాయుడు విమర్శించారు. శుక్రవారం పాలసముద్రం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా థామస్ పేదలకు ఆర్థిక సహాయం చేస్తే, అక్రమార్జన చేసి ప్రజలకు పంచిపెడుతున్నారని నారాయణస్వామి ఆరోపించడం సరికాదన్నారు. ఎన్నికల్లో నారాయణస్వామికి ప్రజలే బుద్ధిచెప్పి ఓడిస్తారని చెప్పారు. నాయకులు శేఖర్ రాజు, పంజాక్షరం, సాంబశివన్, రవి నాయుడు, శేఖర్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

విజయపురం, జనవరి 5: మండల కేంద్రమైన విజయపురం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, ప్రధానోపాధ్యాయురాలు శ్యామల చేతుల మీదుగా పంపిణీ చేశారు. పబ్లిక్ పరీక్షలు రాయడానికి ఉపయుక్తంగా జామెంట్రీబాక్సు, ప్యాడ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు.

పోలీసు ఛారిటీవాల్‌లో అన్నదానం

చిత్తూరు, జనవరి 5: స్వామి పరమహంస యోగానంద జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని పోలీస్ ఛారిటీవాల్‌లో విశ్రాంత అధ్యాపకులు వెంకట్రామయ్య, అమ్మఒడి నిర్వాహకులతో కలిసి అన్నదానం నిర్వహించారు. ఆస్పత్రికి విచ్చేసిన రోగుల బంధువులు, ప్రజలకు అన్నదానం చేశారు. అమ్మఒడి నిర్వాహకులు పద్మనాభ నాయుడు, మల్లికార్జున్ ఆచ్చారి, ప్రభాకర్, మురళీధర్ పాల్గొన్నారు.